సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు



జిల్లాలోని పలు బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. 10లో▸



ముందస్తు బతుకమ్మ సంబరాలు

శుక్రవారం నుంచి దసరా సెలవులు ప్రకటించగా పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
35.0/23.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

ఆదిలాబాద్‌రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే సూచించారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వి, భీంసరి గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు నగదు బహుమతులు

ఆదిలాబాద్: దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారికి ప్రత్యేక నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఆదిలాబాద్ డీఎం కల్పన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22, 23, 28, 29, 30 తేదీల్లో ప్రయాణించినవారిలో 110 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి రూ.11 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున బహుమతులు అందిస్తామని తెలిపారు. బస్సు దిగిన తర్వాత ప్రయాణికులు టికెట్ వెనుక పేరు, చిరునామా, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలని సూచించారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కల్పన

జైనథ్: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని ఆదిలాబాద్ డీఎం కల్పన పేర్కొన్నారు. మండలంలోని తర్నం గ్రామంలో గురువారం ఆర్టీసీ సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీ9–60, టీ–30 టిక్కెట్లతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ స్టేషన్ మేనేజర్ జనార్దన్, సేఫ్టీ వార్డెన్ షేక్ యూసుఫ్, విలేజ్ బస్ ఆఫీసర్ సీ సతీశ్ పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

బోథ్: బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మానాల శేఖర్, మండలంలోని సూర్యనగర్, సాకెర గ్రామస్తులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈటలను కలిసిన వారిలో నాయకులు రాజన్న, రాజేశ్వర్, సాయన్న, రాజు, రాకేశ్, రాజేశ్వర్ తదితరులున్నారు.

రిమ్స్‌లో దృష్టి దినోత్సవం




కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

ఎదులాపురం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో రిమ్స్‌లో గురువారం దృష్టి దినోత్సవాన్ని నిర్వహించారు. 14 మందికి కంటి ఆపరేషన్లు చేసి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యుడు ఇద్రీస్ అక్రానీ, ఆప్తాలమిక్ అధికారి లింగేశ్ తదితరులు పాల్గొన్నారు.

లేనిది ఉన్నట్టు..!



ప్లేట్‌లెట్ సెల్స్ 77వేలుగా ఇచ్చిన రిపోర్టు



మరో ల్యాబ్‌లో 3.33లక్షలున్నట్లు రిపోర్టు



- ఆదిలాబాద్ ప్రైవేట్ ఆస్పత్రుల కనికట్టు
- ప్లేట్‌లెట్లు తక్కువ చూపుతూ రిపోర్టులు
- గాబరా పడుతున్న రోగుల బంధువులు
- నయం చేస్తామంటూ మాయమాటలు
- వలలో పడితే బాధితుల జేబుకు చిల్లే..
- పర్యవేక్షణ లేకే నిర్వాహకుల ఆగడాలు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాల ఆగడాలు హద్దు మీరుతున్నాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం తప్పుడు రిపోర్టులు ఇస్తుండగా రోగులు, వారి బంధువులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిని అవకాశంగా తీసుకుని వ్యాధి నయం చేస్తామంటూ లేని రోగానికి చికిత్స చేస్తూ జేబులు ఖాళీ చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకే ఆస్పత్రుల యాజమాన్యాల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో నివసించే 63 ఏళ్ల వృద్ధురాలు ఈనెల 7వ తేదీన స్వల్ప అస్వస్థతకు గురికాగా ఆమె కుటుంబీకులు స్థానిక విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు పరీక్షించిన అనంతరం రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించడంతో అదే ఆస్పత్రిలో నమూనాలు ఇచ్చారు. రిపోర్టులో ప్లేట్‌లెట్ సెల్స్ 77వేలకు పడిపోయినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు గాబరా పడ్డారు. కొంత ఆయాసం, దగ్గుతో బాధపడుతున్న ఆమెలో ఎలాంటి నిస్సత్తువ లేకపోవడంతో వారు అనుమానపడ్డారు. ఆ ఆస్పత్రి నుంచి తీసుకువెళ్లి మరో ప్రైవేట్ ల్యాబ్‌లో ప్లేట్‌లెట్ సెల్స్‌కు సంబంధించి పరీక్షలు చేయించగా ఏకంగా 3లక్షల 33వేలు రావడం గమనార్హం. 1.50లక్షల నుంచి 4లక్షల వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. దీంతో ఆ ఆస్పత్రి వారు తమను మోసం చేయాలని చూశారని నిర్ధారణకు వచ్చారు.

అసలే డెంగీ భయం..

ప్రస్తుతం వైరల్ ఫీవర్‌తో ప్రతి ఇంటా ఒకరిద్దరు సతమతమవుతున్నారు. డెంగీ కేసులు కూడా అధికంగా నమోదవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి. దగ్గు, దమ్ముతో ఆస్పత్రికి వెళ్లినా అనుమానం కొద్దీ రక్త పరీక్షలు చేసే పరిస్థితి. డబ్బులు పోతేపోనీ పరీక్షలు చేయించుకొని అనుమానం నివృత్తి చేసుకుందామని రోగులు, వారి బంధువులు వెనుకాడటం లేదు. సరిగ్గా ఇదే పరిస్థితిని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. లేని రోగాన్ని ఉన్నట్టు చూపిస్తూ పేషెంట్‌తోపాటు బంధువులను హైరానాకు గురిచేస్తున్నారు. తద్వారా చికిత్స అందించి సొమ్ము చేసుకుంటున్నారు. కరోనా మహమ్మారి తర్వాత జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఈ రంగంపై కొద్దిగా అనుభవం ఉన్నవారు ఏకంగా ప్రైవేట్ ఆస్పత్రి నెలకొల్పుతున్నారు. డాక్టర్లను నియమించుకుని ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు.

అధికారుల నిఘా కరువు

జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రులపై నిఘా కొరవడిందనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా ఆ ఆస్పత్రుల్లో చికిత్స చేస్తున్న డాక్టర్లు అర్హత గలవారేనా.. లేదా? అన్న దానిపై కూడా స్పష్టత లేదు. అలాగే ఆస్పత్రి నిర్వహణలో అన్నీ నిబంధనల మేరకు నడుస్తున్నాయా? అనేదానిపై కూడా పర్యవేక్షణ లేకుండా పోయింది. అయితే ఏదైన ఆస్పత్రిలో మోసం జరిగినట్టు అనిపిస్తే తమకు ఫిర్యాదు చేస్తేనే తెలుస్తుందని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు.

తప్పుడు రిపోర్టులు సృష్టిస్తూ..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో లేనిది ఉన్నట్టుగా చూపిస్తూ పేషెంట్‌తో పాటు సంబంధీకులను గాబరా పెట్టడం, దానికి తాము చికిత్స చేస్తామని చెబుతూ ఆ పరిస్థితి నుంచి డబ్బులు రాబట్టడం నిత్యకృత్యంగా మారింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌కు చెందిన ఓ మహిళ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా వైద్యుడు పరీక్షించి గ్లూకోమీటర్‌లో షుగర్ లెవల్స్ 36 ఎంజీ/డీఎల్‌గా ఉన్నట్టు చెప్పాడు. షుగర్ లెవల్స్ పెరగకపోతే ప్రమాదమని, చికిత్స చేయాలని సంబంధీకులకు తెలిపాడు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశాక మరో ల్యాబ్‌లో పరీక్షలు చేయించగా 217 ఎంజీ/డీఎల్ రాగా సంబంధీకులు ఆశ్చర్యపోయారు. ఆ ప్రైవేట్ ఆస్పత్రిలో లేనిది ఉన్నట్టుగా చూపించడం ద్వారా తమ నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని చూశారని గ్రహించారు.

వలలో పడితే అంతే..

ఆదిలాబాద్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో దగ్గు, దమ్ముతో చికిత్స కోసం వెళ్లినా రూ.వేలలో బిల్లు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పేషెంట్ సంబంధీకులు డబ్బులు భరించే స్థాయిలో ఉన్నారని గ్రహించి నిర్వాహకులు ఇలా లేనిది ఉన్నట్టుగా కనికట్టు చేస్తున్నారు. ఈ వలలో పడితే రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్ సీజన్ కావడంతో అన్ని ఆస్పత్రుల్లో పేషెంట్ల రద్దీ కనిపిస్తోంది. సాధారణ రోగానికి కూడా చికిత్స అంటూ రక్త పరీక్షలు, ఇంజక్షన్స్, సెలైన్‌లు పెట్టామని చెబుతూ అందినకాడికి దండుకుంటున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



వైద్యులు మోసం చేస్తున్నారని గ్రహిస్తే ఆ పేషెంట్ సంబంధీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పుడు విచారణ చేపడతాం. అది వాస్తవమా.. కాదా? అనేది నిర్ధారిస్తాం. ఒకవేళ వాస్తవమని తేలితే నోటీసులిచ్చి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. ప్లేట్‌లెట్స్ 20వేల వరకు పడిపోయి రక్తస్రావమయ్యే పరిస్థితి ఉంటే అది ప్రమాదకరం. అలాంటి పరిస్థితి లేకుంటే పేషెంట్, వారి సంబంధీకులు భయభ్రాంతులకు గురికావొద్దు.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

రూ.50వేల వరకే అనుమతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- అధికారులతో సమీక్ష

కైలాస్‌నగర్: ఎన్నికల కోడ్ ముగిసేదాకా రూ.50 వేల వరకు మాత్రమే నగదు తీసుకెళ్లేందుకు అనుమతి ఉందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఇంతకుమించి తీసుకువెళ్తే సరైన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీ–విజిల్, సువిధ యాప్ నిర్వహణ, పోలీస్, ఎస్ఎస్‌టీ సర్వేలైన్స్ బృందాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీ–విజిల్, సువిధ యాప్ నిర్వహణపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆయా యాప్‌లలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పోలీస్, ఎస్ఎస్‌టీ సర్వేలైన్స్ బృందాలు ఎన్నికల నిబంధనల ప్రకారం జిల్లాలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. పట్టుబడిన నగదు, వస్తువులను విడుదల చేసేందుకు వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రూ.10లక్షలు, అంతకంటే ఎక్కువ నగదు స్వాధీనం చేసుకుంటే దానిపై ఇన్‌కంటాక్స్ శాఖకు సమాచారం అందించాలని తెలిపారు. అంతకుముందు ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ రవి యాప్‌ల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలు నివృత్తి చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

‘ఈటల’పై విమర్శలు తగదు



మాట్లాడుతున్న సలేందర్ శివయ్య

ఎదులాపురం: హైదరాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ముదిరాజ్ మహాసభ సక్సెస్ కావడాన్ని జీర్ణించుకోలేని కొందరు అధికార పార్టీ నాయకులు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు సలేందర్ శివయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్ అధ్యక్షుడిగా ఉన్న బండ్ల ప్రకాశ్‌ముదిరాజ్ ఇతర సామాజిక వర్గాల నేతలతో కలిసి ముదిరాజ్ జాతిపై విమర్శలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తీరు మార్చుకోకుంటే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ముదిరాజ్ మహాసభ నాయకులు ఇండ్ల భూమన్న, రాములు, పాండురంగ్, రమేశ్, రాజేశ్, మోహన్ తదితరులున్నారు.

చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలోగల 44వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎక్సైజ్ సూపరింటెండెంట్ వై.హిమశ్రీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారుల పనితీరు, వాహనాల తనిఖీ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి నిషేధిత మద్యం, గంజాయి ఉత్పత్తులు రాకుండా నిరోధించాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్



జిల్లాకు వచ్చిన బతుకమ్మ చీరలు

కైలాస్‌నగర్: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో బతుకమ్మ చీరల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఎన్నికల్లోపే పండుగ ఉండడంతో ఈ ఏడాది చీరల పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికే జిల్లాకు 2,63,247 చీరలు సరఫరా చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఈనెల 4వ తేదీ నుంచి చీరల పంపిణీ ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఈ నెల 9వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో చీరల పంపిణీని అధికారులు నిలిపివేశారు. కాగా, జిల్లాలో ఇప్పటికే సగానికి పైగా చీరలు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాకు వచ్చిన 2,63,247 చీరల్లో 80శాతం మహిళలకు అందజేసినట్లు పేర్కొంటున్నారు. కోడ్ ముగిశాక మిగతా మహిళలకు చీరలు పంపిణీ చేస్తారా? లేదా.. నిలిపివేస్తారా? అనేది ప్రశ్నార్థకం.

అధికారులూ.. తస్మాత్ జాగ్రత్త !

- నిర్మల్ జిల్లా కలెక్టర్‌పై ఎన్నికల సంఘం వేటు
- ఎమ్మెల్యేల సిఫారసుపైనే పని చేస్తున్న కొందరు ఖాకీలు
- కోడ్‌కు ముందు జరిగిన బదిలీల్లో అధికారుల పైరవీలు
- ఎన్నికల ప్రక్రియలో అధికారుల తీరుపైనా ఈసీ నిఘా



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫారసులతో పని చేస్తున్న కొందరు అధికారుల్లో గుబులు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం అధికారులపై కొరడా ఝులిపిస్తోంది. రాష్ట్రంలో నలుగురు కలెక్టర్లు, ముగ్గురు సీపీలు, పది మంది ఎస్పీలతో సహా మరో నలుగురు రాష్ట్ర ఉన్నతాధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పించి వేటు వేసిన విషయం తెలిసిందే. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి సైతం ఉన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఇంకా కొందరు అధికారులు అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన వారిపైనా చర్యలకు ఉపక్రమించే అవకాశం లేకపోలేదు. ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉంటూ వారికి అనుకూల పనులు చేస్తూ కొందరు అధికారులు కూడా లబ్ధి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ, పోలీసు, ఇతర యూనిఫాం, సర్వీసులో ఉన్న కొందరు ఇప్పటికీ నేతల సిఫారసుపైనే పని చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని పక్కనబెట్టి కూడా సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులు ఉన్నారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. తహసీల్దార్, ఆర్డీవో అధికారుల వరకు బదిలీల్లో పైరవీలు సాగాయి. నచ్చని చోట తహసీల్దార్లు పోస్టింగ్‌లో చేరకుండా బెట్టు చేసిన వారూ ఉన్నారు. ఉమ్మడి జిల్లా పది నియోజకవర్గాల పరిధిలో గత జూలై, ఆగస్టులో బదిలీలు జరిగాయి. కొందరు విధుల్లో చేరకముందే మొదట వచ్చిన ఉత్తర్వులు మార్చుకుని మరీ నచ్చిన చోట చేరిపోయారు. ఆర్డీవో(రిటర్నింగ్ అధికారి), తహసీల్దార్(అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి) ఎన్నికల్లో కీలకంగా వ్యవహరిస్తారు. ఆ స్థాయి అధికారులను కూడా ముందే అనుకూలమైన వారిని తెచ్చుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో నగదు, మద్యం, బహుమతులు విచ్చలవిడిగా పంపిణీ చేసే అవకాశం ఉందనే నేపథ్యంలో ఎన్నికల సంఘం(ఈసీ) ‘సీ–విజిల్’ యాప్‌లో ఎవరైనా ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చని తెలిపింది. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటామని ఈసీ ప్రకటించింది.

‘ఖర్చు’ చేసుకున్న ఖాకీలు..

రెండు నెలల క్రితం పోలీసు బదిలీలు జరిగాయి. ఇందులో కొందరు పోలీసులు పైరవీలు చేసుకున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసుకుని నచ్చిన పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరారు. అయితే కొందరికి అనూహ్యంగా మళ్లీ స్థానం చలనం కలిగింది. ఇంకా కొందరు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో అధికార యంత్రాంగం అంతా ఎన్నికల కమిషన్ పరిధిలోనే పని చేస్తుంది. ఈ క్రమంలో ఎవరైనా అధికారులు ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా పని చేయకపోతే బదిలీ వేటు తప్పకపోవచ్చు. ప్రజాప్రతినిధుల సిఫారసులు కష్టపడి తెచ్చుకుని ‘ఖర్చు’ చేసుకుని వచ్చి కోరుకున్న సీటులో కూర్చున్న కొంతమంది ఖాకీలకు ఇబ్బందికరంగా మారే అవకాశాలున్నాయి.

ఎస్పీపై ఆర్ఎస్పీ ఆరోపణలు

కుమురంభీం ఎస్పీతోపాటు ఐఏఎస్, ఐపీఎస్‌ల వేటుపై సిర్పూర్ బీఎస్పీ అభ్యర్థి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ ‘ఇక్కడి ఎస్పీని బదిలీ చేయడం ఈసీ మరిచిపోయింది..’ అంటూ ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలోనూ కొందరు అధికారులు నిష్పక్షపాతంగా పని చేయడం లేదని కొందరు విపక్ష నేతలు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి ఇప్పటికే కొన్ని ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

పులుల సంచారంపై ఆరా



పెన్‌గంగ నది పరిసరాలు పరిశీలిస్తున్న అధికారులు

తాంసి: భీంపూర్ మండలం తాంసి(కే), గొల్లఘాట్ గ్రామాల శివారులో గతంలో పెద్ద పులులు సంచరించిన ప్రాంతాలను గురువారం టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. గొల్లఘాట్, తాంసి(కే) శివారుతో పాటు పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాలను పరిశీలించి పులుల సంచారంపై ఆరా తీశారు. తరచూ మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న పులులు మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. పెన్‌గంగ నదిలో వరదప్రవాహం ప్రస్తుతం తగ్గడంతో అటువైపు నుంచి పులులు వచ్చే అవకాశం ఉన్నందున పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పులులు వస్తే తక్షణమే రక్షణ చర్యలు కల్పించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలకు అటవీ జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ.. ముందు జాగ్రత్తగా పెన్‌గంగ పరిసరాలను సిబ్బంది ద్వారా పరిశీలిస్తూ.. ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కలిస్తున్నామని పేర్కొన్నారు. వారి వెంట బీట్ అధికారి గులాబ్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, సోనేరావు, దత్తు తదితరులున్నారు.

కానిస్టేబుల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ షురూ..



ప్రక్రియ పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్: ఇటీవల వెల్లడైన కానిస్టేబుల్ తుది ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం ప్రారంభమైంది. ప్రక్రియను ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలతో కూడిన డాక్యుమెంట్లను గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన మూడు సెట్లు, ఆరు ఫొటోలు, ప్రతీ జిరాక్స్‌పై స్వీయ ధ్రువీకరణతో అందించాలని సూచించారు. శుక్రవారం కానిస్టేబుల్, ఫైర్ కానిస్టేబుల్, టీఎస్ఎస్పీ విభాగాల్లోని మిగతా ఉద్యోగాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. జిల్లాలో సివిల్ విభాగంలో 149 మంది, ఏఆర్ విభాగంలో 84 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించగా, ధ్రువీకరణ ప్రక్రియకు సివిల్ విభాగానికి సంబంధించి నలుగురు, ఏఆర్ విభాగానికి సంబంధించి ఒక అభ్యర్థి గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు సంజీవ్‌కుమార్, మురళి, ఆశన్న, ప్రసాద్, హెడ్ క్వార్టర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామానికి చెందిన విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు గురువారం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాధికారి ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన దప్కుల నవనీత్–నిఖిత దంపతుల కుమారుడు ఆర్యన్ (7) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటూ రెండో తరగతి చదువుతున్నాడని తెలిపారు. ఆర్యన్‌కు గత సోమవారం జ్వరంతో పాటు ఫిట్స్ రాగా పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. పాఠశాల యజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆర్యన్ మృతి చెందాడని ఆరోపించారు. పాఠశాల యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంరక్షకుడు గజానన్, గ్రామస్తులు ఉల్లాస్, నితిన్, సురేందర్, అశోక్, స్వామి తదితరులున్నారు.



జిల్లా విద్యాధికారి ప్రణీతకు వినతిపత్రం ఇస్తున్న అర్లి(టీ) గ్రామస్తులు

క్లుప్తంగా

పలువురిపై కేసు నమోదు

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామ కమాన్ వద్ద గురువారం ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఫొటో పెట్టి చెప్పుల దండ వేసి విఠల్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ అసభ్య పదజాలలతో బూర్గుపల్లి(జి) గ్రామానికి చెందిన రాథోడ్ అరుణ్ లాల్, రాథోడ్ అశోక్, సూర్యం తండాకు చెందిన రాథోడ్ రవీందర్‌లతో పాటు మరి కొంత మంది వీడియో చిత్రీకరించారు. దీంతో బూర్గుపల్లి (జి) గ్రామానికి చెందిన రాథోడ్ వసంత్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించిన ఐదుగురికి జరిమానా

ఎదులాపురం: కులం పేరుతో దూషించిన కేసులో ఐదుగురికి జైలు శిక్ష లేని పక్షంలో జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి డాక్టర్ శివరాం ప్రసాద్ గురువారం తీర్పు చెప్పినట్లు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం 2000లో జైనథ్ మండలం గూడ గ్రామానికి చెందిన నిమ్మల ప్రభాకర్‌ను అదే గ్రామానికి చెందిన ఎద్దుల వినోద్, నెమ్మది శ్రీధర్, నెమ్మది శ్రీపతిరావ్, షేక్ హుస్సేన్, తోట రమేశ్‌లు దసరా పండుగ సందర్భంగా కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు ప్రభాకర్ 26 అక్టోబర్ 2020న జైనథ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఏఎస్సై జీవన్ కుమార్ కేసు నమోదు చేయగా డీఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ వెంకటేశ్వర్ రావు దర్యాప్తు చేశాడు. సీడీవో జమీర్ 11 మంది సాక్షులను ప్రవేశపెట్టగా పీపీఈ కిరణ్ కుమార్ రెడ్డి వాదించి నేరం రుజువు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి శివరాం ప్రసాద్ నేరస్తులైన పై ఐదుగురికి నెల రోజుల జైలుశిక్ష, లేని పక్షంలో ఒక్కొక్కరికి రూ.3000 చొప్పున జరిమానా విధించారు.

నగదు సీజ్

దస్తురాబాద్: మండల కేంద్రం సమీపంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన ఉల్వకాని శ్రీనివాస్ అనే వ్యక్తి ఎటువంటి పత్రాలు లేకుండా రూ.లక్ష నగదు తరలిస్తుండడంతో సీజ్ చేసి కలెక్టర్ కార్యాలయానికి తరలించినట్లు ఎస్సై ప్రభాకర్ రెడ్డి తెలిపాడు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

తాండూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి గురువారం బెల్లంపల్లి జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.ముఖేష్ రెండున్నర ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... తాండూర్ ఐబీకి చెందిన పుల్గం రాజ్‌కుమార్ తన స్నేహితుడు కిరణ్‌తో కలిసి 2015, అక్టోబర్ 20న గోపాల్‌నగర్ గ్రామంలోని స్నేహితులను కలవడానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి ఐబీలోని ఇంటికి వస్తుండగా తాండూర్ గ్రామ శివారులో పత్తి చేను వద్ద బుర్స విజయ్ అనే వ్యక్తి ఆటో ట్రాలీతో వేగంగా ఎదురువచ్చి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో పుల్గం రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలై మృతిచెందాడు. కిరణ్ స్వల్ప గాయాలతో తృటిలో బయటపడ్డాడు. అప్పటి ఎస్సై అశోక్ కుమార్ కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడు బుర్స విజయ్‌కు పై విధంగా జైలుశిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపాడు.

ఖాకీల కోడ్ కూత..!

- కమిషనరేట్ పరిధిలో రంగంలోకి పోలీసులు
- లైసెన్స్‌డ్ తుపాకులు డిపాజిట్ చేయాలని హెచ్చరికలు
- రౌడీషీటర్లు, మాజీలకు కౌన్సెలింగ్
- బెల్ట్ షాపులపై దాడులు
- ఠాణాల పరిధిలో బైండోవర్లు



మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో జిల్లాలోని పలువురు వ్యక్తుల వద్ద ఉన్న లైసెన్స్ తుపాకులను ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధి అధికారులకు అప్పగించాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆయా ఠాణాల పరిధిలోని పాత నేరస్తులను, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్, బైండోవర్లు నిర్వహించేందుకు వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. మద్యం, డబ్బు కట్టడి చేసేందుకు బెల్ట్ షాపులపై దాడులు, ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు.

రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలోని అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేస్తోంది. సీపీరెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో ఇప్పటికే చర్యలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, చెన్నూర్ బెల్లంపల్లి, రామగుండం, మంథని, పెద్దపెల్లి ఖానాపూర్ నియోజవర్గ పరిధి లోని జన్నారం కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి.

లైసెన్స్‌డ్ తుపాకులు డిపాజిట్...

ఎన్నికల సందర్భంగా లైసెన్స్‌డ్ తుపాకి కలిగి ఉన్న వారి నుంచి పోలీసులు వాటిని డిపాజిట్ చేయించుకుంటున్నారు. జిల్లాలో 17 లైసెన్స్ తుపాకులున్నాయి. ఇందులో 11 బ్యాంకు సెక్యూరిటీ సిబ్బంది వద్ద ఉన్నాయి. పోలీసుల ఆదేశాలతో బ్యాంకుల సెక్యూరిటీ అధికారులు మినహా మిగిలిన వారు తమ వద్ద ఉన్న ఆయుధాలను ఆయా ఠాణాల్లో డిపాజిట్ చేయాలని సూచించారు. వాటిని కమిషనరేట్‌లోని ఆయుధ కారగారంలోకి తరలించనున్నారు.

బైండోవర్లతో అల్లరిమూకల కట్టడి..

కమిషనరేట్ పరిధిలో ఎన్నికల వేల అల్లరి మూకలను కట్టడి చేసేందుకు బైండోవర్లు చేయాలని సీపీ ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ పార్టీల్లో ఉంటూ గొడవలు సృష్టించే వారి జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. గతంలో బైండోవర్లు చేసినవారందరినీ మళ్లీ బైండోవర్ చేయనున్నారు. అలాగే ఇటీవల వివిధ కేసుల్లో, గొడవల్లో పాల్గొన్న వారిని, మాజీలను, నేరస్తులను, వివిధ కేసుల్లో నిందితులను, రౌడీషీటర్లను బైండోవర్లు చేయనున్నారు.

రౌడీ షీటర్లపై నిఘా..

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో 202 మందిపై రౌడీషీట్ నమోదైంది. ఇందులో కొందరు మృతిచెందగా మరికొందరు మాకం మార్చేశారు. ప్రస్తుతం జిల్లాలో 185 మంది ఉన్నారు. ఇందులో కొందరు సత్ప్రవర్తనతో మసులుకుంటుండగా.. మరికొందరు యథావిధిగా తమ పంథాను కొనసాగిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల వారిగా రౌడీషీట్ రికార్డుల ఆధారంగా పోలీసులకు కొంత అవగాహన ఉన్నా కొత్తగా భూ వివాదాల సెటిల్‌మెంట్లు, పంచాయతీల్లో జోక్యం చేసుకుని దౌర్జన్యం చేస్తూనే ఉన్నారు. ఇలాంటి వారిని గుర్తించి వారు ఎక్కడనున్నారు.. ప్రస్తుతం ఏమి చేస్తున్నారో పూర్తి వివరాలు సేకరించే పనిలో ఇప్పటికే నిమజ్ఞమయ్యారు. వారిపై పూర్తి స్థాయి నిఘా కోసం ప్రత్యేక యంత్రాంగం పనిచేస్తోంది.

వచ్చే నెల 30తో నిర్మల్‌కు విముక్తి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే నెల 30న నిర్మల్‌కు కబ్జాల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి విముక్తి కలగనుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నా రు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బోయివాడ, బాగులవాడ, మామ డ మండలం బురదపల్లి, కాంగ్రెస్ దిలావర్ పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు అందకూర్ నరేష్, శ్రీకాంత్, సురేందర్, సాదుల సతీష్, గురువారం శ్రీహరి రావు క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ప్రకటించిన ఆరు హామీల పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కబ్జాల మంత్రి, సండే ఎమ్మెల్యేకు ఎన్నికల్లో విశ్రాంతి ఇవ్వాలన్నారు. నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ప్రజలు ఓట్లేసి దీవించాలన్నారు. ఈ కార్యక్రమం లో పాడెల్లి గణేష్ ,అర్జుమన్, రవీందర్ రెడ్డి, మతీన్ ,అంగుర్ మహేందర్, నరేష్ , సాయన్న పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించండి

లక్ష్మణచాంద: వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం ఇంటింటికీ బీజేపి గడపగడపకు మహేశన్న కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు మండలంలోని పీచర, ధర్మారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షుడు గోవర్ధన్, మండల కేంద్రం సర్పంచ్ ముత్యం రెడ్డి, ఎంపీటీసీలు రాజేశ్వర్, నర్సారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.



మహిళకు అభివాదం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

ఇల్లు ఇప్పిస్తామని.. ఎకరం రాయించేశారు!

పెంబి: 'మీ ఊరు చిన్నగా ఉంది. మీ ఊరు మరింత అభివృద్ధి చెందాలంటే ఇక్కడ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలి. దీనికి ఎకరం భూమి ఇస్తే.. రూ. 6 లక్షల విలువైన డబుల్ బెడ్‌రూం ఇస్తాం..'అంటూ అధికారపార్టీ నేతలు మాటలు చెప్పి ఆ కుటుంబం నుంచి ఎకరం భూమిని సర్కారుకు దానం చేసినట్లు రాయించేశారు. ఏళ్లుగా ఈ విషయం తెలియని బాధితుడు ఇటీవల బయటపడటంతో కన్నీరుమున్నీరవుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పెంబి మండలం, నాగాపూర్‌కు చెందిన బోసు లక్ష్మి, తిరుపతి దంపతులకు గ్రామంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. 2018లో ఎకరం భూమిఇస్తే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని, మీకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, అప్పటి బీఆర్ఎస్ పెంబి మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు. వారు చెప్పినట్లు సంతకాలు పెట్టామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు రాకపోవడంతో భూమికోసం వెళ్తే అసలు విషయం బయటపడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకున్న ఆధారాన్నీ ఇలా గుంజుకుంటే ఎట్లా బతకాలని కన్నీరుమున్నీరవుతున్నారు. తాజా మాజీ కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిస్తే ప్రభుత్వానికి దానంగా ఇచ్చినట్లు ఉందని చెప్పారన్నారు. తమకు తెలియకుండా, ఎలాంటి పరిహారం ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీన్ని రద్దు చేసి తమ భూమి తమకివ్వాలని ఆ బాధిత దంపతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ లక్ష్మణ్‌ని వివరణ కోరగా రిజిస్ట్రేషన్ 2018లో జరిగింది. అప్పట్లో నేను ఇక్కడ విధులు నిర్వహించలేదు. ఈ విషయం నాకు పూర్తిగా తెలియదని చెప్పారు. త్వరలోనే పరిశీలిస్తామని అన్నారు.

స్థలం ఆక్రమించిన కేసులో ముగ్గురికి జరిమానా

ఎదులాపురం: గృహ నిర్మాణ స్థలాన్ని ఆక్రమించిన కేసులో ముగ్గురికి రూ.500 జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి డాక్టర్ శివరాం ప్రసాద్ గురువారం తీర్పు వెలువరించినట్లు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. లైజన్ అధికారి వివరాల ప్రకారం... 2014లో కాంబ్లే ఆనంద్‌కు సంబంధించిన గృహ నిర్మాణ స్థలాన్ని వకుల భరణం ఆదినాథ్, మహ్మద్ ముజాయిద్ అలియాస్ ముజ్జు, సయిద్ అహ్మద్ అనే ముగ్గురు కలిసి ఆక్రమించారు. దీంతో బాధితుడు 13 జూన్ 2014న ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సీహెచ్ రాణ ప్రతాప్ కేసు నమోదు చేశాడు. అప్పటి డీఎస్పీ లక్ష్మి నారాయణ కేసును దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశాడు. సీడీవో కె.నారాయణ 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీఈ కిరణ్ కుమార్ రెడ్డి నేరం రుజువు చేశారు. నేరస్తులైన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారు.

వాహనం ఢీకొని బాలుడు మృతి



యువరాజ్ (ఫైల్)

నర్సాపూర్(జి): వాహనం ఢీకొని బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బామినితండా గ్రామానికి చెందిన రాథోడ్ యువరాజ్(12) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ప్రకటించడంతో బుధవారం తండ్రి రాథోడ్ రాంజీ ఇంటికి తీసుకెళ్లాడు. గురువారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో యువరాజ్ కిరాణం వద్దకు తినుబండారాలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. ఇంతలో నితీష్ అనే వ్యక్తి మహీంద్ర సుప్రో వాహనాన్ని అక్కడ నిలిపి ఇంట్లోకి వెళ్లాడు. వాహన తాళాలను దానికే వదిలిపెట్టాడు. అదే సమయంలో ముథోల్ల ముత్యం అనే వ్యక్తి వచ్చి వాహనాన్ని స్టార్ట్ చేయడంతో అదుపుతప్పి షాపు వద్ద ఉన్న బాలుడిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

సదర్‌మాట్‌లో ఒకరి గల్లంతు



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ పంచాయతీ పరిధిలోని బుడగజంగం కాలనీకి చెందిన ఓ వ్యక్తి కాలనీ సమీపంలోని సదర్మాట్ కాలువలో మద్యం మత్తులో దూకి గల్లంతైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన టేకుల కొమురయ్య తరచూ భార్యతో వనిత గొడవపడుతూ ఉండేవాడన్నారు. భార్యపై దాడిచేయడంతో వారం రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మద్యం మత్తులో కొమురయ్య గురువారం మధ్యాహ్నం మెట్‌పల్లి వెళ్లే మార్గంలోని రోడ్డు వద్ద అతడి సోదరి సుమలత ఎదుటే కాలువలో దుకాడు. స్థానికులు కొమురయ్య కోసం రోజంతా గాలించినా కానరాలేదు. బాధితుడికి ఇద్దరు కుమారులు, కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపాడు.

తోపులాటలో ఒకరి మృతి.. నలుగురు రిమాండ్

ఎదులాపురం: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో జరిగిన తోపులాటలో ఒకరు మృతిచెందినట్లు టూ టౌన్ సీఐ అశోక్ తెలిపాడు. ఆయన కథనం ప్రకారం.. ఇస్మాయిల్, కరీం, నహీం, కలీం, సలీంల మధ్య మంగళవారం రాత్రి తోటలాట చోటుచేసుకుంది. ఇందులో ఇస్మాయిల్ మృతిచెందగా మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నలుగురిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గురువారం తెలిపాడు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

భైంసా: బాసర గోదావరి నదిలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 35 నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళ బాసర వంతెన కింద మృతదేహం కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు చేరుకుని బయటకు తీశారు. మృతురాలి చేతులకు ఆకుపచ్చ మట్టి గాజులు, ఎడమకాలుకు నలుపుదారం, లేత గోధుమ రంగు నైటి ధరించి ఉన్నట్లు ఎస్సై తెలిపాడు. తెలిసిన వారు ఉంటే 8712659540, 8712577677 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై కోరాడు.

బెల్ట్‌షాప్‌లపై పోలీసుల దాడులు

- మూడు లక్షల మద్యం పట్టివేత
- ఐదుగురు అరెస్టు



పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఇచ్చోడ: మండలంలో గురువారం ఉదయం ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించి భారీ స్థాయిలో మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో సీఐ వివరాలు వెల్లడించాడు. మండల కేంద్రంలోని రవీంద్రనగర్ కాలనీలో ఓ పత్రిక విలేకరిగా చెలామణి అవుతున్న నరాల రాజేశ్వర్ ఇంట్లో సోదాలు చేసి రూ.1.50లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి గతంలో గాంధీ జయంతి రోజు మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశారు. అలాగే టేకం సుభాష్, గుట్టు నర్సయ్య, పవర్ సుభాష్, ఠాకుర్ రాంచందర్‌ల వద్ద కలిపి రూ.1.50వేల విలువ గల మద్యం పట్టుకున్నారు. ఆ ఐదుగురిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండవర్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. అక్రమంగా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయించవద్దని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై నరేష్, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, శశి, గంగయ్య, దత్తు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని సీఎం రావు ఫంక్షన్‌హాల్ సమీపంలోని బెల్ట్‌షాప్‌పై ఎస్సై జి.లింబాద్రి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 11,860 విలువ గల 21 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపాడు. అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను సీజ్ చేయడంతో పాటు బెల్ట్‌షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బెల్టు షాపుల సీజ్

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్, పిప్రి, గిర్నూర్, దేగామ, చందునాయక్‌తండాల్లో గురువారం బోథ్ సీఐ భీమేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపుల యజమానులనుపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ శంకర్ సమక్షంలో బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన ఒకరి ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తునట్లు సమాచారం మేరకు గురువారం తెల్లవారు జామున దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపాడు. పట్టుబడిన మద్యం విలువ రూ.10,980లు ఉంటుందని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

పోలీసుల ముమ్మర దాడులు



పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఎదులాపురం: బెల్లు షాపులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా వ్యాప్తంగా బెల్టు షాపులపై దాడి చేసి మద్యాన్ని సీజ్ చేసి, పలువురు విక్రయదారులను బైండోవర్ చేశారు. పట్టణ వ్యాప్తంగా సుమారు రూ.30వేల మద్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. మరోసారి పట్టుబడితే రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సుమారు 30 వేల మద్యం సీజ్..

పట్టణంలోని వన్‌టౌన్, టుటౌన్ పరిధిలోని పలు కాలనీల్లో బెల్లు షాపులపై గురువారం పోలీసులు దాడులు జరిపారు. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, టుటౌన్ సీఐ అశోక్‌ల ఆధ్వర్యంలో ఈ దాడులు కొనసాగాయి. పట్టణంలోని కుమ్మరికుంటకు చెందిన బండారి రమేష్ బెల్టు షాపుపై దాడి చేసి రూ.2400 మద్యాన్ని, అదే కాలనీకి సాయికుమార్ బెల్టుషాపులో రూ.2574, కదల్‌వార్ దిలీప్ బెల్లుషాపులో రూ.1980, పెద్దపల్లి రాజేశ్వర్ బెల్ట్ షాపులో రూ.3385, శ్రీరాం కాలనీకి చెందిన దాంగట్ శంకర్ షాపులోకి రూ.2340 మద్యాన్ని సీజ్ చేశారు. అలాగే పెద్ద మొత్తంలో కారులో మద్యాన్ని తీసుకొచ్చి కారులోనే మద్యం అమ్ముతున్న ఏనుగుల కార్తీక్ వద్ద గల ఐదున్నర లీటర్ల సుమారు రూ.9000 మద్యాన్ని స్వాధీనం చేసుకని, కారును సీజ్ చేశారు. అలాగే మహాలక్ష్మి వాడకు చెందిన యాదవ్ పండిత్ బెల్ట్ షాప్‌లోని దాదాపు రూ.9000 మద్యాన్ని పోలీసు స్వాధీనం చేసుకున్నారు. పలువురు విక్రయదారులను బైండోవర్ చేశారు.

11 మందిపై కేసు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్, అనుకుంట, లోకారి, మామిడిగూడ, రామాయి, రాంపూర్, రణదీవెనగర్ తదితర ప్రాంతాల్లోని బెల్టుషాపులపై ఎస్సై ముజాహిద్ గురువారం రాత్రి దాడులు చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపాడు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గానగర్, కేఆర్‌కే కాలనీ, రాంనగర్, మావల తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై ఎస్సై విష్ణువర్ధన్ దాడులు చేసి మందు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాడు.

కుంటాలలో..

కుంటాల: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని భైంసా గ్రామీణ సీఐ నైలు పేర్కొన్నాడు. గురువారం మండల కేంద్రంలోని రెండు హోటళ్లలో దాడులు చేసి రూ.13వేలా 449 విలువ గల 12లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపాడు. ఆయన వెంట ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ పాల్గొన్నారు.

154మద్యం బాటిళ్లు..

బేల: మండల కేంద్రంతో పాటు కొబ్బాయి గ్రామంలోని బెల్టుషాపుల్లో దాడులు చేసి 154 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎస్సై రాధిక పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రెండు, కొబ్బాయి గ్రామంలోని బెల్టుషాపుల్లో నిర్వహించిన దాడుల్లో ఆరు బీర్ సీసాలతో పాటు 148 లిక్కర్ సీసాలను సీజ్ చేశారు. బెల్టుషాపు నిర్వాహకులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మైలాపూర్ శివారులో పులి సంచారం..?

భైంసా: బాసరను ఆనుకుని ఉన్న మైలాపూర్ శివారుల్లో గురువారం పులి సంచరించిందని స్థానికులు చర్చించుకున్నారు. ఉదయం 6 గంటలకే పంటపొలాల్లో పులి కనిపించిందని అంతా భయపడ్డారు. పంట పొలాలకు వెళ్లిన రైతులు పులిని చూశామని చెప్పడంతో తోటివారంతా తీవ్ర భయాందోళనకు గురయ్యా రు. సమాచారం అందుకున్న అటవీశా ఖ అ ధికారులు అక్కడికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. పులి కనిపించినట్లు చెబుతున్న పంట పొలాల్లోకి వెళ్లగా ఎలాంటి పాదముద్రలు, ఆనవాళ్లు కనిపించలేదని అధికారులు చెప్పా రు. స్థానిక ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఏదైన సమాచారం తెలిస్తే సంప్రదించాలని సూచించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్‌శాఖ దాడులు

దస్తురాబాద్: మండలంలోని మున్యాల తండాలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ వివరాల ప్రకారం... మండలంలోని మున్యాల తండా గ్రామంలో గుండుబా తయారు చేస్తున్నారని సమాచారం మేరకు గ్రామంలోని అజ్మీరా శ్రీనివాస్, అజ్మీరా మంజుల ఇళ్లపై ఎక్సైజ్‌శాఖ దాడులు నిర్వహించి పది లీటర్ల గుండుబాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ సరిహద్దుల్లోని పాడుబడిన ఇంట్లో 800 లీటర్ల పులియ బెట్టిన బెల్లం పానకాన్ని పట్టుకున్నారు. తయారీకి వినియోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం చెన్నూర్ గ్రామానికి పాత నేరస్తులైన దాసరి నర్సయ్య, కనక శంకర్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, నరేష్, హరీష్, భాస్కర్, కల్పన ఉన్నారు.

బెల్లం, పటిక స్వాధీనం

ఉట్నూర్‌రూరల్: సారా తయారీకి వినియోగించే బెల్లం, పట్టికను గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మహేందర్‌సింగ్ వివరాల ప్రకారం.. మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో సారా తయారు చేసేందుకు బెల్లం, పట్టికను విక్రయిస్తున్నట్లు సమాచారంతో సిబ్బందితో కలిసి నిస్తే ధనరాజ్ కిరాణ దుకాణంపై దాడి చేసి 2.50 క్వింటాళ్ల బెల్లం, ఐదు కేజీల పట్టికను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఆశన్న, హెడ్ కానిస్టేబుల్ పి.విశాల్, సిబ్బంది శ్రావణ్ ఉన్నారు.



బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు